క్లుప్తంగా

ఉచిత వైద్యసేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీరామ్మూర్తి

గంట్యాడ: గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాల్లో అందించే ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని పెదమధుపాడ సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి సూచించారు. మండలంలోని పెదమధుపాడలో ఎస్.కోటకు చెందిన కొలపర్తి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. వైద్యులు నీరజ్‌కుమార్, తదితరులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితురాలికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: అనారోగ్యంతో బాధపడుతూ, వివిధ ప్రమాదాల్లో గాయపడి ఆరోగ్యశ్రీ వర్తించని తొమ్మిది మంది లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం తన స్వగృహంలో 8,24,513 రూపాయల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏర్పడిన సంవత్సరంన్నర కాలంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు కోటీ 40 లక్షలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉభాలు ప్రారంభం



పాచలవలస వద్ద వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన దమ్ము మడి

దత్తిరాజేరు: వరుణుడు కరుణించడంతో రెండు రోజులుగా మండల పరిధిలో ఉభాలు జరుగుతున్నాయి. మండలంలోని కోమటిపల్లి, చెరుకుపల్లి, మరడాం, పెదమాపురం, ఇంగిలాపల్లి, పాసలవలస, వంగర, దాసరిపేట, తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో నాట్లు వేసేందుకు మడులను సిద్ధం చేశారు.

ఎండిపోతున్న వరి నారు



గుర్లలో ఎండిపోతున్న వరి నారు

గుర్ల: వర్షాలు పడకపోవడంతో వరి నారు ఎండిపోతోంది. వరుణుడు కరుణించకపోవడంతో పాటు గెడ్డలు, వాగుల్లో కూడా నీరు లేకపోవడంతో నారుకు నీటి తడులు అందించలేక రైతులు తలలు పట్టుకుంటున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే ఖరీఫ్ సీజన్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు చెబుతున్నారు. మండలంలోని గుర్ల, కలవచర్ల, గోషాడ, పాలవలస, కోటగండ్రేడు, తెట్టంగి, పల్లిగండ్రేడు, తదితర గ్రామాల్లో పంట భూములు దాదాపు బీడు భూములుగా మారిపోయాయి.

కూలిపోయిన వాటర్ ట్యాంక్ దిమ్మ



కూలిపోయిన దిమ్మ

వేపాడ: మండలంలోని కడకొండలో జేజేఎల్‌ఎం నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్ దిమ్మ కూలిపోయింది. గ్రామ సమీపంలోని చెరువుగట్టుపై దిమ్మ నిర్మించి దానిపై ట్యాంక్ ఏర్పాటు చేశారు. జేజేఎల్‌ఎం నిధులు రూ. పది లక్షలతో చేపట్టిన ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో కూలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ వివరణ కోరగా సంబంధిత కాంట్రాక్టర్‌చే మళ్లీ పనులు చేయిస్తామన్నారు.

పురస్కారం..

లక్కవరపుకోట: సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేషంగా రాణిస్తున్న కిత్తన్నపేటకు చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరినాయుడుకి జాతీయ ప్రతిభా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఏలూరు పట్టణంలో గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఇటీవల ప్రదానం చేసినట్లు గౌరినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గౌరినాయుడును గ్రామస్తులు అభినందించారు.

యథేచ్ఛగా ఆక్రమణలు..

- రహదారులపైనే దుకాణాలు
- నో పార్కింగ్ చోటే వాహనాల నిలుపుదల
- గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్‌తో ఇక్కట్లు



గణేష్ కోవెల రోడ్డులో కాలువపై ఆక్రమణలు

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం పట్టణ కేంద్రంలో ఎటు చూసినా రహదారులపై ఆక్రమణలు కనిపిస్తున్నాయి. ఏ రోడ్డు చూసినా దుకాణాలు, తోపుడుబళ్లతో కుచించుకుపోతున్నాయి. దీనికి తోడు వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేస్తుండడంతో నగరవాసులకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్లపై అడుగడుగునా బడ్డీ కొట్లు వెలియడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఎంతో వెడల్పుగా ఉండాల్సిన రోడ్లు కుచించుకుపోయి ఇరుకుగా మారుతున్నాయి. ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రోడ్లు రద్దీగా మారుతున్నాయి. అదే సమయంలో నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు వివిధ పనులకు వెళ్లేవారు రోడ్డుపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అడుగడుగునా తోపుడు బళ్లు..

నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎటువైపు చూసినా రోడ్లపైన తోపుడు బళ్లు, బడ్డీకొట్లు, అల్పాహార దుకాణాలు వెలిశాయి. వీటి వల్ల కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఎక్కడెక్కడ..

నగరంలో ఎస్‌బీఐ బ్యాంక్ కూడలి.. రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతం.. మెంటాడ వెళ్లే రహదారి.. దేవీ స్వీట్‌షాపు నుంచి పాత ఎంపీడీఓ కార్యాలయం రహదారి.. పోలీస్‌స్టేషన్ నుంచి వంద పడకల ఆస్పత్రి చివరి వరకు రోడ్డుకిరువైపులా ఇష్టారీతిలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అలాగే తోపుడు బళ్లు ఎక్కడికక్కడ పెట్టేస్తుండడంతో ఏ రోడ్డు చూసినా రద్దీగా కనిపిస్తోంది.

పార్కింగ్‌కు చోటేదీ..?

నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లపై ఉన్న పలు షాపింగ్ మాల్స్‌కు వాహనాల పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లమీద ఇష్టారీతిలో నిలుపుదల చేసేస్తున్నారు. దీంతో ప్రధాన జాతీయ రహదారి అంతా ఇరుకుగా మారి ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల రహదారుల విస్తరణ జరిగినప్పటికీ రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో మళ్లీ రోడ్లు ఇరుకుగా మారాయి.



మెంటాడ రోడ్డులో ఇదీ పరిస్థితి



సీసీ కాలువపై నిర్మాణాలు

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం..

ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి అనధికార వాహనాలు, తోపుడు బళ్లను గుర్తించి తీయిస్తున్నాం. అలాగే పంచాయతీల నుంచి సంబంధిత అధికారులు స్పందించి అనధికార నిర్మాణాలపై దృష్టి సారిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది. – కిరణ్‌కుమార్, ఎస్సై, గజపతినగరం

అస్తవ్యస్తం..

నియోజకవర్గ కేంద్రంలో రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేయడంతో పాటు చిరు వ్యాపారులు రోడ్డు మీదే దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ఉదయం, సాయంత్రం రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రోడ్డు మీద రాకపోకలు సాగించాలంటేనే భయంగా ఉంది. – అల్తి రామునాయుడు, స్థానికుడు, గజపతినగరం

అవగాహన కల్పిస్తున్నాం..

నియోజకవర్గ కేంద్రంలోని పురిటిపెంట, గజపతినగరం రెండు పంచాయతీలలో కాలువలపై నిర్మాణాలు చేపట్టడం వాస్తవమే. అల్పాహార దుకాణాలు, తోపుడు బండ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఆక్రమణలు చేపట్టకూడదంటూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేస్తున్నాం. – జనార్దనరావు, ఈఓ, గజపతినగరం పంచాయతీ

'గీతా' ప్రచారం



ఎస్.కోట పట్టణంలో మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకులు ఆదివారం సాయంత్రం పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశం తెలుసుకోవాలని కోరారు. - శృంగవరపుకోట

ప్రమాదకరంగా భవనాలు



కూలేందుకు సిద్ధంగా ఉన్న తరగతి గది

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఒక తరగతి గది, అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. ఈ భవనాలు నిర్మించి సుమారు 20 సంవత్సరాలే అవుతున్నా... పెచ్చులుడి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ భవనాల చుట్టూ పిల్లలు ఆటలాడుతుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాలను తొలగించాలని ఇప్పటికే ఎంఈఓకు తెలియజేశామని హెచ్‌ఎం తెలిపారు.



వినియోగానికి దూరంగా ఉన్న అంగన్‌వాడీ భవనం

రక్తదానంపై అపోహలు విడనాడాలి



రక్తదానం చేస్తున్న దాతలు

గజపతినగరం రూరల్: రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలున్నాయన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతిఒక్కరూ మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రేవంత్, సభ్యులు ప్రసాద్, రూపేష్, అజయ్, ఆశిక్, మణికంఠ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు

గుళికలు, జింక్ కొంటేనే యూరియా ఇస్తున్నారు..



నాయకుల వద్ద సమస్యలను ఏకరువు పెడుతున్న రైతులు

గజపతినగరం: గుళికలు, జింక్ ఎరువులు కొనుగోలు చేస్తేనే డీలర్లు యూరియా ఇస్తున్నారని పలువురు రైతులు అన్నారు. మండలంలోని కొత్త శ్రీరంగరాజపురంలో జనసేన మండల అధ్యక్షుడు జగన్నాథరావు ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మున్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో పని చేయని సర్వర్



వేపాడ సబ్ పోస్టాఫీస్

వేపాడ: మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందడం లేదు. ఈ సబ్ పోస్టాఫీస్ పరిధిలో ఉండే ఎనిమిది బ్రాంచ్‌ల్లో ఇబ్బందులు నెలకొన్నాయి. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో సేవలు పూర్తి స్థాయిలో అందించలేక సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. జనరేటర్ గాని ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడంతో విద్యుత్ సరఫరా లేని సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సబ్ పోస్టుమాస్టర్ జి. తాత వద్ద ప్రస్తావించగా.. కొత్త యాప్ అప్‌లోడ్ చేయడం వల్ల సర్వర్ సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను అధిగమించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

'కోట'లో హర్ ఘర్ తిరంగా..



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: ప్రధాని మోదీ పిలుపుమేరకు స్థానిక బీజేపీ నాయకులు పట్టణంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మరిస శ్రీను నేతృత్వంలో స్థానిక వివేకానంద కళాశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు త్రివర్ణ పతాకాలు చేతపట్టి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకోటి, సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, సీహెచ్ అప్పారావు, బొండపల్లి చంద్రశేఖర్, దొడ్డి సూర్యారావు, వి.చిరంజీవి, కోన మోహనరావు, టీడీపీ నాయకులు కె.మల్లేశ్వరరావు, రమణ, సాయిరాం, వాసు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాల్సిందే..

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి



చింతలపాలెంలో మహిళలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ఎటువంటి షరతులు లేకుండా పూర్తిస్థాయిలో అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలపాలెం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు మాట్లాడుతూ.. కూటమి నాయకుల అబద్ధపు హామీలు నమ్మి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెల సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటికే అందించే ప్రభుత్వాన్ని కాదని.. మాయమాటలు చెప్పే ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామని మండిపడ్డారు. కడుబండి, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేయడంలో అగ్రగణ్యుడని ఎద్దేవా చేశారు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని సాక్షాత్తూ ఓ మంత్రి అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హామీలిచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని అన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు మాయమాటలు చెప్పి ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరోపించారు. ఆయన తన రాజకీయ జీవితంలో ఎప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, చింతలపాలెం, దేశపాత్రునిపాలెం గ్రామాల మాజీ సర్పంచ్‌లు పల్లా భీష్మ, బొడ్డు అప్పారావు, యల్లపు రమణ, నక్క కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి, పార్టీ నాయకులు సింగంపల్లి గణేష్, గొరపల్లి రవికుమార్, మాధవరావు, గేదల త్రినాథమూర్తి, పీఎస్ఎస్ పాత్రుడు, దాడి శ్రీనివాసరావు, ఐ.అనిల్‌కుమార్, సాల్మన్‌రాజ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

వేపాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామస్వామిపేటలో మధ్యాహ్నం 3 గంటలకు.. పీకేఆర్ పురం, కొండగంగుబూడిలో 4 గంటలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

దత్తిరాజేరు: పెదమానాపురం వద్ద రైల్వే వంతెన పనులు అధికారుల నిర్లక్ష్యం వల్లే పూర్తి కావడం లేదని బీజేపీ నియోజకవర్గ నాయకుడు దేవర ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం పడితే ప్రస్తుతమున్న తాత్కాలిక రోడ్డులో రాకపోకలు చాలా ఇబ్బందికరమని పేర్కొన్నారు. రోడ్డుపైనున్న గోతులు పూడ్చకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కొటియా సరిహద్దు సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద సరిహద్దు ప్రాంతమైన కొటియా సమస్యను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి ఉన్నా ఇక్కడ నెలకొన్న గిరిజన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు కొటియా గ్రామాల సమస్యలపై స్పందిస్తారని అంతా ఎదురుచూశారని అయినా ఆయన నోటి నుంచి ఎటువంటి ప్రకటన రాలేదన్నారు. అదే ఒడిశా డిప్యూటీ సీఎం, మహిళా శిశు సంక్షేమ శాఖ, పర్యాటక రంగ అభివృద్ధి శాఖ మంత్రి పార్వతి పరిథ, ఒడిశా అధికారులు కొటియా ప్రాంతంలో పర్యటించారని, ఇక్కడి వారెందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. ఇరు రాష్ట్రాలు ఆ ప్రాంతంపై హక్కు కోసం పోరాడుతున్నప్పుడు ఒక్క ఒడిశానే పైచేయి సాధించి, అక్కడి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవడం దుర్మార్గమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో కూటమి భాగస్వామిగా ఉన్నారని, అక్కడ కూడా బీజేపీ ప్రభుత్వం ఉన్నందున ఇప్పుడే కొటియా సమస్య పరిష్కారానికి మార్గం సుగమమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

మట్టి రోడ్డుతో ఇబ్బందులు

గుర్ల: మండలంలోని రాగోలు నుంచి గొలగాం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే మట్టిరోడ్డు చిత్తడిగా మారుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి రాగోలు నుంచి గొలగాం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ జేఈ రమేష్ తెలిపారు.



రాగోలు నుంచి గొలగాం గ్రామానికి వెళ్లే మట్టి రహదారి